విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

సర్పంచి వ్యవస్థ నిర్వీర్యం : కాగిత

విశాలాంధ్ర-బంటుమిల్లి :- సర్పంచి వ్యవస్థను నిర్వీర్యం చేసి గ్రామాలాభివృద్ధికి అడ్డుగోలుగా నిలుస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పెడన నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం పెడన నియోజకవర్గ సర్పంచుల సంఘం తరపున సర్పంచుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని కోరుతూ బంటుమిల్లి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో రాష్ట్ర పంచాయతీరాజ్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ ముప్పినేనిరవి ప్రసాదు, పెడన నియోజకవర్గం పంచాయతీరాజ్ సంఘ అధ్యక్షులు ఓరుగంటి విగ్నేశ్వర వెంకటాచలం అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పెడన నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ కాగిత కృష్ణ ప్రసాద్, పెడన నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పంచకర్ల సురేష్, మచిలీపట్నం రాష్ట్ర పంచాయతీ కార్యదర్శి కాగిత గోపాలరావు, పెడన జడ్పిటిసి అర్జా వెంకట నగేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాగిత మాట్లాడుతూ సర్పంచ్‌కి ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి బాధ్యతలు లేకుండా పంచాయతీరాజ్ వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. పంచాయతీకి కావాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ రాష్ట్ర వైసీపీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆర్థిక వనరులను దుర్వినియోగం చేస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధి జరగకుండా గ్రామ సర్పంచులకు విలువలు లేకుండా వైసీపీ ప్రభుత్వం పంచాయతీలు నిర్వీర్యం చేసిందని కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. జనసేన సమన్వయకర్త సురేష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసి వాటి స్థానంలో సచివాలయాల పేరుతో వలంటీర్ల ద్వారా వ్యవస్థను నడుపుతూ నిధులను దుర్వినియోగం చేసిందని సురేష్ అన్నారు . రాష్ట్ర పంచాయతీరాజ్ సంఘం కార్యదర్శి రవి ప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీ వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసి ప్రజలచే ఎన్నుకోబడిన సర్పంచులను పట్టించుకోకుండా గ్రామ అభివృద్ధి చేయకుండా పూర్తిగా నిర్వీర్యం చేసిందని ప్రసాద్ అన్నారు .ఏ ప్రభుత్వమైనా గ్రామపంచాయతీలను మండల అభివృద్ధిని చేస్తేనే ఆ వ్యవస్థ బాగుపడుతుంది ఆ రాష్ట్ర అభివృద్ధి చెందుతుంది అని రవి ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ,మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు ,మాజీ జెడ్పిటిసిలు, మాజి ఎంపీపీలు తదితర హోదాల్లోని నాయకులు పాల్గొన్నారు.

రావికి మరోసారి మొండిచెయ్యి..!

- కష్టపడ్డా దక్కని ఫలం - ప్రాధాన్యత కల్పించేనా...?
- పార్టీని బలోపేతం చేయడం రావి చేసిన నేరమా...?
- ఒత్తిళ్ళు, వ్యక్తిగత పంతాలకు రావి కుటుంబం బలి...?
- అప్పట్లో సీటులు కొడాలి, దేవినేనికి, నేడు వెనిగండ్లకు

గుడివాడ రాజకీయాలు చాలా విచిత్రంగా ఉంటాయి. ఎవరికి అంతు పట్టవు. శ్రమతో పనిలేదు, డబ్బు ఉంటే చాలా...?టిడిపిలో ఎమ్మెల్యే టిక్కెట్ దక్కించుకోవచ్చా...? అవుననే అంటున్నారు. గుడివాడ ఓటర్లు... 2004, 2009లో హోరాహోరీగా తలపడి ఓటమి చెందినా మొక్కోవని పట్టుదలతో పదేళ్ళ పాటు పార్టీ పటిష్టతకు కృషి చేసిన రావిని కాదని ఇటీవలే పార్టీలో చేరిన వెనిగండ్లకు గుడివాడ పార్టీ ఇన్‌చార్జిని చేస్తున్నట్లు ప్రకటించి, టిక్కెట్ కూడ ఇస్తున్నట్లు తెలియడంతో నాయకులు, కార్యకర్తలు ఆగ్రహావేశాలు వెల్లబుచ్చుతున్నారు. గతంలో చేసిన తప్పునే తిరిగి చంద్రబాబు చేస్తున్నారని టిడిపి నాయకులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుండి పార్టీని అట్టిపెట్టుకుని, పటిష్టతకు కృషిచేసిన రావి కుటుంబానికి మళ్ళీ మొండిచెయ్యి చూడటం దారుణమని...ఇది ఏ పరిణామాలకు దారితీస్తుందనే కార్యకర్తలు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ ఈ పేరు వింటే చాలు నందమూరి తారకరామారావు గుర్తుకు వస్తారు. ఆ తురువాత అంతటి క్రేజ్‌ను సంపాదించుకున్న కుటుంబం రావిది. ఎన్‌టీఆర్ పదవిచ్యుతుడిని చేసే ఎపిసోడ్‌లో రావి శోభనాద్రి చౌదరి చంద్రబాబు వెంటనే నడిచారు. చంద్రబాబుకు విధేయులుగా రావి కుటుంబం నిలిచింది.

2004లో మొదటిపారి హ్యాండ్

పార్టీ ఆవిర్భావం నుండి టిడిపిలోనే ఉన్న రావి కుటుంబానికి 2004లో జూనియర్ ఎన్‌టీఆర్ రూపంలో బ్రేక్ పడింది. ఆనాడు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న రావి వెంకటేశ్వరరావును జూనియర్ ఎన్‌టీఆర్ ఒత్తిడి మేరకు చంద్రబాబు తప్పించి అప్పటి తెలుగు యువత నాయకుడు కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)కు టిక్కెట్ కేటాయించారు. దీంతో పార్టీకి విధేయులుగా ఉన్న రావి కుటుంబం అధిష్టానం మాటకు కట్టుబడి కొడాలి నాని గెలపునకు సహకరించింది. 2009లో టిక్కెట్ దక్కుతుందని భావించిన రావి వెంకటేశ్వరరావుకు మొండి చెయ్యి చూపారు. దీంతో చేసేదేమి లేక అప్పటి ప్రజారాజ్యం పార్టీలో చేరి గుడివాడ నుండి పోటీ చేసి ఓటమి చెందారు. 2004, 2009 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి టిక్కెట్‌పై గెలిచిన కొడాలి నాని, 2014లో అనూహ్యంగా వైకాపాలోకి జంప్ అయ్యారు. ఆనటి నుండి చంద్ర బాబు, లోకేశ్, మంత్రి దేవినేని ఉమాలను టార్గెట్ చేస్తూ తీవ్ర పదజాలంతో విరుచుపడే వారు. పార్టీలో తనను ఎదగకుండా మంత్రి ఉమా అడ్డుకున్నారనే కారణంతోనే నాని ఉమాను నోటికి వచ్చినట్లు దూషిస్తారని నాని వర్గీయులు తెలుపుతున్నారు.

కష్టకాలంలో గుర్తుకు వచ్చేది రావి కుటుంబం

2014లో కొడాని నాని టిడిపికి యిచ్చిన ఝలక్‌తో పార్టీ మైండ్ బ్లాక్ అయ్యింది. విధేయులను వదులుకుని తప్పుచేశామని భావించి సరైన నాయకుడి కోసం వెతుకులాట ప్రారంభించింది. రావి కుటుంబాన్ని తిరిగి పార్టీలోకి తీసుకువచ్చేందుకు స్వయంగా సినీనటుడు బాలకృష్ణ రంగంలోకి దిగి సఫలీకృతులయ్యారు. పార్టీ కేడర్ చెల్లాచెదురై, కనీసం పార్టీకి భరోసా యిచ్చే నాయకుడు లేకపోవడంతో అధిష్టానం మాట, బాలకృష్ణ మాటకు విలువనిచ్చి రావి కుటుంబం తిరిగి పార్టీలో వచ్చింది. దీంతో 2014లో తెలుగుదేశం మొదటి జాబితాలోనే గుడివాడ టిక్కెట్‌ను రావి వెంకటేశ్వరరావుకు దక్కడంతో ఎన్నికల్లో వైకాపా అభ్యర్థి కొడాలి నానితో హోరాహోరీగా తలపడి కేవలం 12వేల ఓట్ల తేడాతో ఓటమి చెందినా రావి అధైర్యపడలేదు. రెట్టించిన హుషారుతో పార్టీని బలోపేతం చేయడానికి ఊరురా తిరిగారు. సంక్షేమ పథకాలను అందరికి అందేలా కృషి చేశారు. జిల్లాలో ఎందరో టిడిపి నాయకులు అవినీతికి ఆసరాగా నిలిచి సొమ్ములు కూడా పోగోసుకున్నా... ఉద్యోగాలను అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. కానీ రావి ఆ దిశగా ఆలోచన చేయలేదు. లంచం తీసుకున్న వారిని ఉపేక్షించలేదు. పదేళ్ళ పాటు సొంత నిధులతో పార్టీ పటిష్టతకు కృషి చేశారు. తన రాజకీయ చతురతతో కొడాలి నానిని పలు సందర్భాల్లో ఇరుకున పెట్టారు. అయినా ఫలితం దక్కడం లేదు.

కొడాలి నానినే టార్గెట్...

ముఖ్యమంత్రి చంద్రబాబు, తనయుడు లోకేశ్, మంత్రి దేవినేని ఉమాలను టార్గెట్ చేస్తూ ప్రతి సందర్భంలో కొడాలి నాని విమర్శిస్తుంటారు. ఆయన విమర్శలకు వీరందరూ ఇరకాటంలో పడేవారు. అసెంబ్లీలో సైతం తనదైనా స్టైల్‌లో వీరిని ఉతికి ఆరేసేవారు. పార్టీలో ఉన్నా, పార్టీ మారినా ఫైర్ బ్రాండ్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. దీంతో చంద్రబాబు, లోకేశ్‌లు కొడాలి నానిని టార్గెట్ చేసుకుని ఎట్టి పరిస్థితుల్లో నానిని ఓడించాలనే కృతనిశ్చయానికి వచ్చారు.

బలి పశువు రావి....?

జిల్లాలో గెలిచినా ఓడినా పార్టీ కోసం కష్టపడ్డ వ్యక్తి ఎవరైనా ఉన్నారా అంటే అది రావి వెంకటేశ్వరరావు మాత్రమేనని పార్టీ అధినాయకుడు చంద్రబాబు సైతం గుర్తించారు. అయిదేళ్ళు కష్టపడ్డ తనకు టిక్కెట్ దక్కుతుందనే రావి వెంకటేశ్వరరావు ధీమాలో ఉన్నారు. కొడాలి నానిని టార్గెట్ చేసిన లోకేశ్ ఓడించి తన పంతాన్ని నెగ్గించుకోవాలనే తలంపుతో ఈ ఎన్నికల్లో గుడివాడ అభ్యర్థిగా దేవినేని అవినాష్ పేరును రేస్‌లోకి తీసుకువచ్చారు. తనను, తన తండ్రిని తీవ్రంగా దూషించే, ద్వేషించే నానికి చెక్ పెట్టాలని ప్లాన్ చేసుకున్నారు. దీనిలో భాగంగా రావిని కాదని ఆర్థికంగా, సామాజికంగా బలవంతుడైన, యువకుడు అవినాష్ అయితే పోటీలో నిలబడి నానిని ఓడిస్తారని లోకేశ ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీంతో అధిష్టానం అవినాష్‌కు టిక్కెట్ ఖరారు చేసింది. మళ్ళీ 2020 నుండి అవినాష్ పార్టీ పార్టీ వీడి వైసీపీలోకి వెళ్ళాడంతో రావినే కొడాలి నానికి దీటుగా సమాదనం చెప్పు 12 కేసులను సైతం పెట్టిటంచుకోవడం జరిగింది. నేడు ఇన్ని కేసులు పెట్టించుకున్న రావి కాదని నేడు ఎన్‌ఆర్‌ఐ వెనిగండ్ల రాము గుడివాడ టిడిపి ఇన్‌చార్జిగా ప్రకటించడంతో కార్యకర్తలు నాయకులు పార్టీకి రాజీనామ చేసేందుకు సిద్ధం అవడం గమనర్హం. నాడు జూనియర్ ఎన్‌టిఆర్, నేడు లోకేశ్, చంద్రబాబుల స్వలాభానికి రావి కుటుంబం బలిపశువు అవుతోందని కార్యకర్తలు, అభిమానులు వాపోతున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి కంచుకోటగా ఉన్న గుడివాడలో కష్టపడ్డ వారికి ఫలం దక్కడం లేదనే వాదన వినవస్తోంది.

రావికి న్యాయం జరిగేనా...?

2019లోను ఇదే విధంగా హామి అధికారంలోకి రాకపోవడంతో రావి సైతం మిన్నకుండిపోయారు. మళ్ళీ, మళ్ళీ అదే సందర్భం ఎదురు కావడంతో ఏమి చేయాలో పాలుపోక రావి తలపట్టుకుంటున్నారు. పార్టీ నిర్ణయమే శిరోధార్య మంటూనే కష్టకాలంలో వెన్నంటి ఉన్న తనకు అన్యాయం ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా పార్టీ కష్టకాలంలో వెన్నంటి నిలిచిన రావి కుటంబానికి చంద్రబాబు, లోకేశ్‌లు కలిసి తీవ్ర అన్యాయం చేస్తున్నారని కార్యకర్తలు తమ మనోభావాలను వ్యక్తం చేస్తున్నారు. గుడివాడ టిడిపి టిక్కెట్ రావికి ఇవ్వని పక్షంలో, పార్టీ అధిష్టానం ఏ విధంగా న్యాయం చేస్తుందో వేచి చూడాలి.

గ్రామాల్లో ప్రారంభమైన సామాజిక తనిఖీలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో 2021-2022 ఆర్థిక సంవత్సరంలో ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారానిర్వహించిన వివిధ పనులను సామాజిక తనిఖీల బృందం పరిశీలించి నివేదిక రూపొందిస్తున్నారు. దీనిలో భాగంగానే ఆదివారం అవురు పూడి గ్రామంలో డి.ఆర్.పి .జి. పూర్ణ బాబు ఆ సంవత్సరంలో నిర్వహించిన 60 పనులు పరిశీలించి లొకేషన్లు నమోదుచేసుకుని పనులు చేసిన కూలీల వేలిముద్రలు సేకరించారు. అలాగే, వైయస్సార్ పెంక్షన్ ద్వారా పంపిణీ చేసిన వివిధ రకాల పింఛన్లపై లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. ఆ పంచాయతీ పరిధిలో పంపిణీ చేసిన వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పెన్షన్లను లబ్ధిదారుల ద్వారా ఆరా తీశారు. అనంతరం డి.ఆర్.పి. పర్యవేక్షణలో ఆదివారం పంచాయతీ వద్ద గ్రామ సభ నిర్వహించారు. దీనికి మండల పరిషత్ వైస్ ఎంపీపీ డొక్కు వెంకటేశ్వరావు హాజరైనారు.

లంకపల్లిలో దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-పమిడిముక్కల: లంకపల్లి గ్రామంలో షేరింగ్ అండ్ కేరింగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్టీ కుటుంబాలకు చలి నుండి రక్షణ నిమిత్తం దుప్పట్లు పంపిణీ చేసినట్లు ట్రస్టు అధ్యక్షులు శీలం రత్నరాజు తెలిపారు.ఆదివారం లంకపల్లి కరకట్ట పై నివశించే ఎస్టీ కి చెందిన ఆరు కుటుంబాలకు ఇంటర్ నేషనల్ బ్రాహ్మిణ్ పార్లమెంటు రాష్ట్ర అధ్యక్షుడు దినవాహి ప్రసాద్ స్థానిక సర్పంచ్ వేమూరి రత్న కుమారి ల ద్వారా దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా రత్నరాజు మాట్లాడుతూ శీతాకాలం లో పేదలకు, పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి సంవత్సరం దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని దాతలు సహకరిస్తే మరిన్ని కార్యక్రమాల్ని నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో వేమూరి రమేష్, కె.వెంకటేశ్వర రావు రామోజీ రమేష్, కోటి శివ చరణ్ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి సన్నిధిలో జొన్నవిత్తుల

విశాలాంధ్ర-కూచిపూడి : ప్రముఖ సినీ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు ఆదివారం సాయంత్రం నాట్య క్షేత్రమైన కూచిపూడి లోని నాట్యాచార్యుల ఇలవేలు పైన శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంను కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి జరిగిన పూజ కార్యక్రమంలో పాల్గొని ఆశీస్సులు తీసుకున్నారు. ఇదే సమయంలో దేవాలయ ప్రాశస్త్యాన్ని, భూముల వివరాలను, వేద పండితుల వివరాలను ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు భాగవతుల సీతారామారావు, గ్రామస్తుల ద్వారా సేకరించారు. కూచిపూడి అగ్రహారాన్ని, శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించటం ఆనందకరమైన సంఘటనగా వివరించారు. దేవాలయాల ప్రాశస్త్యాన్ని సమాజానికి తెలియ జేసేందుకు గ్రంధాన్ని రూపొందిస్తున్నామని దీనిలో భాగంగానే ప్రాచుర్యం గల దేవాలయాలను సందర్శిస్తున్నానన్నారు. ఈ నేపథ్యంలో 250 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన కూచిపూడి దేవాలయాన్ని సందర్శించుకున్నట్లు కోరుకుంటూ వివరాలు సేకరించిన్నట్లు ఆయన వివరించారు.. ఈ సందర్భంగా అర్చకులు పెనుమూడి పూర్ణచంద్రశేఖర శర్మ, ఆలయ కమిటీ శేష వస్త్రాలతో సత్కరించారు.

మురుగు పారదు-అధికారులు కదలరు

విశాలాంధ్ర-అవనిగడ్డ : పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం పంచాయతీ ప్రజలకు శాపంగా మారింది. డ్రెయినేజిల ద్వారా ముక్కులు పగిలిపోయేలా మురుగు కంపు కొడుతున్న పంచాయితీ అధికారులు సోద్యం చూస్తూమురుగు నీరు పోయేందుకు చర్యలు మాత్రం చేపట్టడం లేదు. ఇటీవల మిచాంగ్ తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు వీధులలో మురుగు కాలువల్లో పూడికలు తీయడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీని వల్ల మురుగు కదలక తిష్ట వేయడంతో నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లడంతో పాటు రోగాల భారీన పడుతున్నామని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు, నాయకులు ఎన్నికల సమయంలో చూపించిన శ్రద్ధ తరువాత కనిపించడం లేదని డ్రెయినేజి వ్యవస్థపై ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి మురుగు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. డ్రెయినేజి వ్యవస్థపై శ్రద్ధ చూపకపోవడంతో చినుకు పడితే చాలు డ్రెయినేజి లు పొంగి రహదారులు జలమయమవుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా పంచాయితీలోని సమస్యలతో ప్రజలు భాదలు పడుతున్నారు. వర్షపు నీరు పోవడానికి సరైన డ్రెయినేజి వ్యవస్థ సరిలేకపోవడంతో రహదారులు అన్నీ చిత్తడిచిత్తడిగా మారుతున్నాయి. దీంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాలు పాలవుతున్నారు.

ఆరోగ్యం కోసం ఆడుదాం ఆంధ్ర

విశాలాంధ్ర-అవనిగడ్డ : క్రీడా నైపుణ్యం మానసిక ప్రశాంతత, ఆరోగ్యం పెంపొందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర క్రీడలకు స్వీకారం చుట్టారని శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర మస్కట్ బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. డిసెంబర్ 15 వ తేది నుండి ఫిబ్రవరి 3 వ తేది వరకు ఈ పోటీలలో 15 సంవత్సరాల వయస్సు దాటి వారు అందరూ పాల్గొనవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఔత్సాహిక క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని సింహాద్రి కోరారు. క్రీడలలో పాల్గొనేవారు ముందుగా వాలంటీర్ ద్వారా కానీ, 1902 ద్వారా కానీ, సచివాలయాల్లో కానీ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి ఝాన్సీ లక్ష్మీ నియోజకవర్గ టెక్నికల్ ఇన్‌చార్జ్ రమణ, నియోజకవర్గ వ్యాయాప ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు కోసూరు పూర్ణచంద్రరరావు, కార్యదర్శి గరికిపాటి మారుతి, వ్యాయామ ఉపాధ్యాయులు బాణుప్రకాష్‌ల తో పాటు పలువురు పి.ఇ.టిలు పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థులపై పందేలు!

విశాలాంధ్ర-అవనిగడ్డ : నియోజకవర్గంలో ఏ పార్టీ తరుపున ఏ అభ్యర్థి పోటీ చేస్తారు అన్న దానిపై పందాల జోరు ముమ్మరం అయ్యింది. రాష్ట్రంలో కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ, వైయస్‌ఆర్ కాంగ్రెస్, తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉండగా నియోజకర్గంలో కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలకు ప్రజల మద్దతు చాలా తక్కువగా ఉంది. సెప్టెంబర్ నెలలో తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్టు అయ్యి రాజమండ్రి సెంట్రల్ జెయిల్ లో ఉండగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పరామర్శించిన అనంతరం బయటకి వచ్చి జనసేన, తెలుగుదేశం పార్టీలు సంయుక్తంగాపోటీచేస్తాయని ప్రకటన విడుదల చేశారు. అప్పటి వరకు తెలుగుదేశం, జనసేన లు ప్రతిపక్ష పార్టీలుగా ఉండి ఎవరికి వారే ప్రభుత్వంపై ప్రజా సమస్యలను ఎత్తి చూపుతూ వచ్చారు. ఆ నాటి నుండి తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిసి నిరసన తెలియచేయడంతో అవనిగడ్డ నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన పార్టీల నేతలు ఎవరికి వారే సీటు మాదేంటే మాది అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరుణంలో జనసేన పార్టీ తరుపున జిల్లా పార్టీ అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణలతో పాటు పలువురు పోటీలలో ఉండగా, తెలుగుదేశం పార్టీ తరుపున మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ రేసులో ఉన్నప్పటికి మరో ఇరువురు, ముగ్గురు చాపకింద నీరులా నియోజకవర్గ అభ్యర్థిత్వం కోసం చాపకింద నీరుగా ఎవరికి వారే పనులు చేసుకుంటూ వెలుతున్నారు. ఈ తరుణంలో కార్యకర్తలు మాత్రం నిశబ్దంగా ఉండకుండా జనసేన అయినా, టిడిపి అయినా అభ్యర్థి మాత్రం మండలి బుద్ధప్రసాదే అంటూ కొంత మంది, మరి కొంత మంది అవనిగడ్డ నియోజకవర్గం నుండి జనసేన పార్టీకి చెందిన అభ్యర్థే ఉంటారంటూ ఆ పార్టీ నేతలు సైతం బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. ఎవరు ఎంత మంది ఎన్ని చెప్పిన బుద్ధప్రసాదే అభ్యర్థి అంటూ 2 లక్షల రూపాయలను చెక్ రూపేనా బెట్టింగ్‌లు కట్టి మధ్య వర్తులకు చెక్ లను అందచేసినట్లుగా వినికిడి.ఈ తరహాలో పెద్ద స్థాయి లోనే నియోజకవర్గంలో పార్టీల అభ్యర్థిత్వాలపై బెట్టింగ్‌ల జోరు మాత్రం పెద్ద ఎత్తునే జరుగుతున్నాయి. అయితే ఇప్పటివరకు వైయస్‌ఆర్‌సిపి కానీ, టిడిపి, జనసేన కానీ అభ్యర్థులను ప్రకటించలేదు. తెలంగాణా రాష్ట్ర ఎన్నికల ఫలితాలతో రాష్ట్రంలో కూడా ఫలితాలు తారుమారు అయ్యే అవకాశం ఉందని, ఆ యా పార్టీల రాష్ట్ర అధ్యక్షులు దృష్టి సారించి నూతన వ్యక్తులకే ఇచ్చే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలో మాత్రం జనసేన తెలుగుదేశం లు ఉమ్మడిగానే పోటీచే స్తాయని సాంకేతికాలు ఇచ్చినప్పటికి క్రింది స్థాయిలో మాత్రం ఎవరికి వారే సీటు మాదే అంటూ పోటీలు పడుతూ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఇదే తరుణంలో ఊహించని వ్యక్తులు ఆ యా పార్టీల తెరపైకి వచ్చే అవకాశాలు ఉన్నాయని ఊహాగానాలు మాత్రం ఎక్కువగా వినిపిస్తున్నాయి. మొన్నటి వరకు క్రికెట్ బెట్టింగ్ ల జోరుతో ఉన్న యువత నేడు పార్టీల అభ్యర్థిత్వాలపై దృష్టిని మరలించారు. గతంలో ఎన్నికల అనంతరం మాత్రమే గెలువు, ఓటములపై బెట్టింగ్ ల జోరు కొనసాగేది. ఇప్పుడు యువత నూతన వరవడికి శ్రీకారం చుట్టారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-పెదపారుపూడి : మిచౌంగ్ తుఫాను కారణంగా వరి పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నెంబర్, కాంగ్రెస్ పార్టీ పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్ పెదపూడి దిలీప్ కుమార్ ఆదివారం ప్రభుత్వాన్ని కోరారు. తుఫాన్ కారణంగా రైతులుపడే ఇబ్బందులను తెలుసుకునేందుకు నియోజకవర్గంలో ఆయన విస్తృతంగా పర్యటించి రోడ్లపై ఉన్న ధాన్యాన్ని,పొలంలోని వరి పనలను పరిశీలించారు. అలాగే కొండిపర్రు గ్రామంలో ముత్యాల వీర వెంకటరావు అనే కౌలు రైతు పొలంలోని మొలక వచ్చిన వడ్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెదపూడి మాట్లాడుతూ మినుము నష్టపోయిన ప్రతి రైతుకు సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయాలని, అలాగే నష్టపరిహారం అందించాలని, బ్యాంకులలో తీసుకున్న రుణాలు రీ షెడ్యూల్ చేసి కొత్తగా రుణాలు అందించాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పామర్రు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలపాడు సుబ్బారావు, మొవ్వ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిట్టి శ్రీనివాసరావు, పార్టీ కార్యదర్శి హైదర్ తదితరులు పాల్గొన్నారు.

తన్మయులను చేసిన చిత్ర గీతాలాపన

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : స్వరఝురి సాంస్కృతిక సేవా సమితి(ఒంగోలు) ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై తెలుగు కళావాహిని, జి ఆర్ కె పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సహకారంతో జరిగిన సినీ సంగీత విభావరి శ్రోతలను తన్మయులను చేస్తూ సాగింది. గాయనీ గాయకులుగా తాళ్లూరి శ్రీదేవి, అంజు స్వామి, ఎస్ కె అంజి బాబు, డి కోటేశ్వరరావు, ఆలపాటి అశోక్ కుమార్, వి ఎస్ బాలాజీ తదితరులు సంగీత సాహిత్యాల వైభవాన్ని చాటిన అలనాటి ఆణిముత్యాలైన నన్ను ఎవరో తాకిరి, రే రాజు పిలిచెను, రవి వర్మకే, గాలి వానలో, ఒకసారి కలలోకి, నీలో నేనై, చిలిపి నవ్వుల వంటి ఇత్యాది పాటలను శృతిలయలను పోషించుకుంటూ ఆహుతుల హృదయాలను పరవశింప చేస్తూ భావ రసభరితంగా పాడి వినిపించారు. తాళ్ళూరి రవి పర్యవేక్షణ చేయగా చింతకాయల చిట్టిబాబు నిర్వహణ చేశారు.

పేదలకు సరుకులు, దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-చల్లపల్లి : బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జి.ఆర్.భగత్ సింగ్ ఆధ్వర్యంలో చల్లపల్లిలోని ఎస్టీలు, నిరుపేదలకు బియ్యం, దుప్పట్ల పంపిణీ కార్యక్ర మం జరిగింది. తుఫాను కారణంగా జీవనోపాధి కోల్పోయి ఇబ్బందులు పడిన 90 కుటుంబాలకు ఈ సహాయాన్ని అందచేశారు. ఆంధ్రప్రదేశ్లో ఎస్సీ, ఎస్టీ బహుజనులను చైతన్యపరిచి వారి అభివృద్ధికి కృషిచేస్తున్న విద్యుత్శాఖ విశ్రాంత సీఈ కె.భాస్కర్ మరికొందరి దాతల సహకారంతో గుంటూరు కేంద్రంగా బహుజన మహాసభ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి భగత్సింగ్ తెలిపారు. చిన్నారులకు రొట్టెలు, బిస్కట్లు అందించి, 90 కుటుంబాల వారికి సరుకులు, బియ్యం, దుప్పట్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రజకసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు, సామాజిక కార్యకర్త విజయ కుమారి, కైతేపల్లి దాస్, ఉప్పల సాంబశివరావు, తూము వెంకటేశ్వరరావు, ఏలీషా ప్రసాద్, వెంకటేశ్వరరావు, సుధీర్, దుర్గారావు, కార్యకర్తలు నాగేంద్రం, వెంకాయమ్మ, లక్ష్మి, నరసమ్మ, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్యశిబిరం

విశాలాంధ్ర -గన్నవరం : గన్నవరంలోని ప్రముఖ దంత వైద్యశాల లక్ష్మమ్మ స్మైల్ ఎన్ షైన్ మరియు గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక చింతలపేట లోని చర్చ్ ఆఫ్ ది లివింగ్ గాడ్ మినిస్ట్రీస్ మందిరంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ వైద్య శిబిరంలో డా. కె.సంపత్ కుమార్ రాజు మరియు డా .ఎస్.శ్రావ్య చందన లు చర్చ్ సంఘంలో సభ్యులకు దంత పరీక్షలు చేసి టూత్ పేస్టులు, మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దంత సంరక్షణపై అనేక సూచనలు చేశారు. రోజూ ఉదయం, రాత్రి రెండు సార్లు బ్రష్ చేసుకోవాలని, ఏదైనా ఆహారం తీసుకొన్న వెంటనే నోటిని నీటితో పుక్కిలించాలని. ఏదైనా దంత సమస్యలు ఉంటే వెంటనే అశ్రద్ధ చెయ్యకుండా దంత వైద్యున్ని సంప్రదించాలని అన్నారు. సంఘ కాపరి పాస్టర్ ఎస్.జోసెఫ్ రాజు మాట్లాడుతూ ఆదివారం ఆరాధన అనంతరం ఇలాంటి సంఘ సభ్యులు ఇలాంటి సేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నిత్యం కనీసం ఐదు లేక ఆరు లీటర్ల మంచి నీటిని త్రాగాలి. నిత్యం వ్యాయామం, యోగ, ధ్యానం చేయాలి. కనీసం రోజుకు 7 గంటలు నిద్ర పోవాలి, మానసిక వత్తిడి దూరం చేసుకుంటూ జాగ్రత్తలు పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చిప్పాడా చంద్రశేఖర్,సంఘ పెద్దలు దేవరపల్లి విక్టర్ బాబు,లాజరూ, పులి.శ్రీనివాసరావు, ఆశోక్ రాజ్, శ్రీనివాసరావు లు,ఎస్.జ్యోతి,కరుణ,మట్టా విజయలక్ష్మి,చిన్నారి మరియు యూత్ సభ్యులు బెన్ని, హరీష్,శశి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టో పేదలకు వరం

విశాలాంధ్ర-పెడన : చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సంక్షేమ పదకాలతో పేద వర్గాలకు వరం అని పెడన మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖయ్యూం (హన్ను) అన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని 4 వార్డు లో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాల్లో పాల్గొని ఇంటింటా బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా హన్ను మాట్లాడుతూ మహాశక్తి పథకంతో 18 ఏళ్ల నిండిన స్రి కి ఆడబిడ్డ నిది కింద 15 వందల రూపాయలు, తల్లికి వందనం పథకం కింద చదువుకునే పిల్లలకి ఒక్కొక్కరికి 15,000,రూపాయలు, దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితమని, జిల్లాలో ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా మహిళలందరికీ టిక్కెట్ లేని ప్రయాణం చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఉమ్మడి మేనిఫెస్టో లోని అంశాలను ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రషీద్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

మంచు దుప్పటిలో దివిసీమ

విశాలాంధ్ర-అవనిగడ్డ : దివిసీమను మంచు దుప్పటి కప్పేసింది. ఆదివారం సూర్యోదయం అనంతరం మంచు దుప్పటి కప్పేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఎదురు ఎదురుగా వచ్చే వాహనాల లైట్ ల వెలుగులు మాత్రమే కనిపిస్తూ ఉండటంతో ప్రాణాలను చేతిలో పెట్టుకుని ప్రాయాణాలు చేయవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఉదయం 9 గంటల వరకు మంచు పొరల్లోనే దివిసీమ ఉండటంతో ప్రయాణదారులు ఏ సమయంలో ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితిలో ప్రయాణాలు చేయవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మంచు దుప్పటిలో ఎదురు వచ్చే వాహనం దగ్గరకి వచ్చే వరకు కూడా అర్థం కాకపోవడంతో కొంత మంది వాహన దారులు పక్కకు వాహనాలు నిలిపి రాకపోకలను నిలిపివేశారు. మొత్తం మీద మంచు దుప్పటి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసింది.

100 మంది చిన్నారులకు బహుమతులు

విశాలాంధ్ర-చల్లపల్లి : ఆపన్నులకు అండగా నిలిచే ఐవీఎం సేవాసంస్థలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పురిటిగడ్డలోని ఐవీఎం హోమ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఐవీఎం సహకారంతో విద్యాభ్యాసం చేస్తున్న 100 మంది చిన్నారులకు ఐవీఎం డైరెక్టర్ డా.వేములపల్లి సురేష్ రోజా దంపతులు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు విజయ, సోఫి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

విశాలాంధ్ర-విజయవాడ(తిరువూరు) : భవన నిర్మాణరంగం కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి కార్మికులు సంక్షేమ పథకాలు తూట్లు పొడిచిన జగన్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో కార్మికులు తగిన గుణపాఠం చెప్పాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్కే ఉమ్మర్‌వలి పిలుపునిచ్చారు. తిరువూరు సుంకర వీరభద్రరావు భవన్‌లో ఆదివారం ఎస్.కె నాగూల్ మీరా అధ్యక్షతన (కార్పెంటర)జరిగిన కార్మికులు సమావేశంలో ఆయన ఉమ్మర్ వలి, ఏఐటీయూసీ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి కొత్తపల్లి సుంద్రరావు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తండ్రిని మించిన తనయుడుగా ఉంటానని చెప్పిన జగన్‌మోహన్ రెడ్డి తండ్రి పెట్టిన పథకానికి తూట్లు పొడిచి రాష్ట్రంలో 50 లక్షల మంది కార్మికుల కడుపులు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాల తరబడి ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996 దేశవ్యాప్తంగా అమలవుతున్నా రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి బోర్డును తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని తెలిపారు. కార్మికుల నుంచి సంక్షేమ బోర్డులో సభ్యత్వం పేరుతో, భవన నిర్మాణ యజమానుల నుంచి సెస్ పేరుతో వసూలు చేస్తున్న వేల కోట్ల నిధులను అత్త సొమ్ము అల్లుడు దానం లాగా జీవో నంబర్ 17 ద్వారా ప్రభుత్వం సంక్షేమ పథకాలకు, ఇతర ప్రయోజనాలకు మళ్లించుకుంటున్న జగన్ ప్రభుత్వం కష్టజీవుల పక్షపాతినని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. 2018 నుంచి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న సుమారు 53 వేల క్లెయిమ్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దారి మళ్లించిన రూ.1,200 కోట్ల సంక్షేమ బోర్డు నిధులను వెంటనే బోర్డుకు జాను వేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కార్మిక నిధులను వారి ప్రయోజన కోసం ఖర్చు పెట్టాలని డిమాండ్ ఇసుకను ఫ్రీగా పాత పద్ధతిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు, ఈ సమావేశం లో ఏఐటీయూసీ నాయకులు ఎం ప్రసాద్, అయినాల ముత్తయ్య, మెనుగు కృష్ణ, రాయల ఏసు, అబ్దుల్ వహీద్, షేక్ జానీ, చల్లా వెంకటరత్నం భవనిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతి రాణా ఆదేశాల మేరకు విజయవాడ వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఈ కౌన్సిలింగ్ జరిగింది. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ సురేష్‌రెడ్డి, టూటౌన్ సీఐ సుబ్రమణ్యం మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు రౌడీ షీటర్లు పాల్గొంటే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాశాంతికి విఘాతం కలిగించే వారి పై పీడీ యాక్టు నమోదు చేస్తామని చెప్పారు. రౌడీషీటర్లు నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు ఉంటాయని కౌన్సిలింగ్ చేశారు. మంచి నడవడిక కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర

ఎన్టీఆర్ జిల్లా

వన సమారాధనలో జి.కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ, వాసవి ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావుతో కార్యదర్శివర్గ సభ్యులు కె.వి భాస్కరరావులు. అనంతరం ఆర్యవైశ్య నాయకులు దుశ్శాలువాతో సత్కరించారు.

6 నుంచి తిరుపతమ్మ మండల దీక్ష మాలదారణ

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి మండల దీక్ష మాలాధారణ జనవరి 6 నుండి 12వ తేదీ వరకు జరుగు. శ్రీ అమ్మవారి మండల దీక్ష మాలాధారణ మరియు 23-02-2024 అమ్మ వారి వార్షిక కళ్యాణ మహోత్సవం సందర్భంగా కార్యనిర్వహణాధికారి కార్యాలయం నందుఆదివారం కార్యనిర్వహణ అధికారి మరియు డిప్యూటీ కలెక్టర్ రమేష్ నాయుడు గోడ పత్రిక ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు ఏ ఈ ఓ లు తిరుమలేశ్వర రావు. ఉమా పాతి. ఆలయ సూపర్ డెంట్ శ్రీనివాస్.ఉప ప్రధాన అర్చకులు మర్రి బోయిన గోపి బాబు, విశ్రాంత ఉద్యోగి ఎన్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తిరుపతమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే వసంత

పెనుగంచిప్రోలు లో వెంచేసివున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారినిఆదివారం శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ని మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ .దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ కార్యనిర్వహణ అధికారి మరియు డిప్యూటీ కలెక్టర్ కె రమేష్ నాయుడు. అమ్మవారి శేష వస్త్రములు అమ్మవారి చిత్రపటం అందజేసి. ఆలయ అర్చకులు వేద పండితులచే ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందేశారు.

కేజీ వెండి బహూకరణ

తిరుపతమ్మ అమ్మవారి కీ తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరంలోని చింతల్ పద్మా నగర్ వాస్తవ్యులు గడ్డం.రాజేందర్ రెడ్డి స్వాతికా రెడ్డి దంపతులు ఒక కేజీ వెండి బహుకరణ ఆలయ ఏ ఈ ఓ తిరుమలేశ్వర్ రావు చేతుల మీదుగాఆదివారం అందజేశారు.వారికి ఆలయ అర్చకులు వేద పండితులచే ఆశీర్వచనం చేసి శేష వస్త్రములు తీర్థ ప్రసాదాలు అందేశారు.

గాజుల అలంకరణతో...

తిరుపతమ్మ అమ్మవారు ఆదివారం గాజుల అలంకారంతో అమ్మవారు కొలువై ఉన్నారు. ఈ సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.గాజుల అలంకారములకు దాతలు తెలంగాణ రాష్ట్రం ఖమ్మం పట్టణ వాస్తవ్యులు కావేరి హోటల్ యజమాని కర్నాటి వీరభద్ర రావు రమాదేవి దంపతులు.ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వాస్తవ్యులు దొంతి రెడ్డి వాసుదేవరెడ్డి కల్పనా దంపతులు.పెనుగంచిప్రోలు గ్రామ వాస్తవ్యులు కంచర్ల కోటేశ్వరరావు లు కావలసిన గా జులు అన్నియు విరాళముగా ఇచ్చినారు. ఈ గాజులు అలంకరణ లో అమ్మ వారిని వేల సంఖ్యలో భక్తుల దర్శంచుకున్నారు.

వనసమారాధనలో పోలీసుల సందడి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): వనసమారాధనలో పోలీసుల సందడి చేశారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ పరిపాలనా విభాగంలో ఏర్పాటు చేసిన కార్తీక వనసమారాధనలో వికాస్ కళాశాల సమీపంలో సామ్రాజ్య రిసార్ట్స్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా సీపీ కాంతి రాణా హాజరైయ్యారు. పోలీసు కుటుంబ సభ్యులతో కలిసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పలు భరతనాట్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగ రాణా మాట్లాడుతూ పోలీసు కుటుంబ సభ్యులతో గడపడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అజిత వేజెండ్ల, సీఎస్‌డబ్ల్యూ డీసీపీ ఏబీటీఎస్ ఉదయరాణి, అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, ఇన్‌ఛార్జ్ నార్త్ ఏసీపీ సిహెచ్.శ్రీనివాసరావు, ఏవో రంగారావు, పోలీసుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పటమటలో దొంగ-పట్టుకున్న ఇంటి యజమాని

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): పటమటలో అర్ధరాత్రి ఓ దొంగ హాల్‌చల్ చేశాడు. ఓ ఇంట్లో దూరి ఇంటికి కన్నం వేసేందుకు ప్రయత్నం చేశాడు. నిద్రలో ఉన్న ఇంటి యజమాని శబ్దనికి లేచి చూసేసరికి ఇంట్లో దొంగ కనిపించాడు. దీంతో ఆ దొంగను పట్టుకునే ప్రయత్నం చేశాడు. కుటుంబ సభ్యులతో సహాయంతో దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. ఈక్రమంలో ఇంటి యజమానికి స్వల్పగాయాలైయ్యాయి. సమాచారం అందుకున్న పటమట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆ దొంగకు గుంటూరు జిల్లాలోని కొన్ని పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ సస్పెక్ట్ షీటగా ఉన్నట్లు తెలిసింది.

అర్ధరాత్రి దొంగ హల్‌చల్

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం) : విజయవాడ నగరంలో అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. నిర్మలా కన్వెంట్ స్కూల్ సమీపంలో చోరికి యత్నంచాడు. స్థానికులు పట్టుకునే ప్రయత్నం చేయగా, దొంగ ముప్పుతిప్పలు పెట్టాడు. ఎట్టకేలకు పోలీసుల సహాయంతో దొంగను పట్టుకున్నారు. పోలీసులు పట్టుకుని ప్రశ్నించడంతో రెండు బ్యాగులు చోరీ చేశాడు. ఆ బ్యాగులో నగదు లేకపోండంతో రోడ్డున పడేశాడు. ఈమేరకు పోలీసులు అతనని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల హామీలు అమలు చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వేతనాలు పెంచాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని పలువురు నాయకులు విజ్ఞప్తి చేశారు. జింఖానా గ్రౌండ్‌లో ఆదివారం కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీ జెఏసి అమరావతి అనుబంధం) ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. దీనికి కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుమన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో ఉద్యోగస్తులు ఒక భాగం అని అనేక సందర్భాలలో ముఖ్యమంత్రి చెప్పారని, ఇంతక ముందు కాంట్రాక్టర్లు మీ శ్రమను దోచుకునే వారు దానిని నివారించటానికి అప్కాస్ ఏర్పాటు చేసి దళారి వ్యవస్థ లేకుండా నేరుగా వేతనాలు అందిస్తున్నారన్నారు.అన్ని శాఖల్లో పనిచేసే ఉద్యోగుల బాధలను అర్థం చేసుకునే నాయకుడు జగన్ మోహన్ రెడ్డి మీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏపి అమరావతి జెఏసి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తున్న 97 వేల మందిని ఆప్కస్ పరిధిలోకి తీసుకు వచ్చి జీతాలు చెల్లిస్తున్నారని అందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామ న్నారు. అయితే ఇంకా పలు సెక్టార్ లలో ఉన్న ప్రవేటు ఏజెన్సి పరిధిలో ఉన్న వారిని కూడా అప్కాస్ తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.మెడికల్ లీవ్, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే సెలవులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా ఇవ్వాలని సూచించారు.అప్కాస్ ఏర్పాటు చెయ్యకపోతే ఉద్యోగులు అస్తవ్యస్తంగా ఉండేవారు.తాము ఏపీ జేఏసీ అమరావతి సాక్షిగా అండగా ఉంటామన్నారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ ఏర్పాటు చేయాలి, ప్రతి సం..రం జీతాలు పెంచాలి, ఉద్యోగం చేస్తున్న వారు చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వాలి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఔట్ సోర్సింగ్ క్లాస్ ఫోర్ ఉద్యోగులకు కూడా ఇవ్వాలి, ప్రభుత్వం అందరికీ 1వ తేదీన జీతాలు వచ్చే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి అసోషియేట్ చైర్మన్ టి.వి.ఫణిపేర్రాజు, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఈశ్వరరావు,గ్రేడ్-2 విఆర్‌ఓ కృష్ణా జిల్లా అధ్యక్షులు సాంబశివరావు, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ జనరల్ సెక్రెటరీ అల్లం సురేష్, పలిశెట్టి దామోదరరావు, యు. అనిల్ కుమార్, గురునాథం, పి. వేణు,యస్ వి కృష్ణ, జి.మెర్సీ కుమారి,కె. జయరామ్, యం మధుబాబు,పి కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ సీపీఐ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సమావేశం ఆదివారం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ మయూర్ శర్మ, తెలంగాణ పార్టీ కార్యవర్గ సభ్యులు అగ్నివేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మయూర్ శర్మ మాట్లాడుతూ భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ కార్మిక వర్గ విముక్తి కోసం, అణగారిన వర్గాల కోసం 1934 ఆగస్టు 1న ఏర్పడిందన్నారు.దోపిడీ, అసమానతలు లేని సమాజం కోసం కార్మిక వర్గ రాజ్య స్థాపన కోసం భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశం అనంతరం ఆంధ్రప్రదేశ్ నూతన ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేశారు.రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా రంబాల సతీష్‌ను ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నుకున్నది,నూతన కార్యవర్గ సభ్యులు జె కుమార్, డి నారాయణమూర్తి,బి ఏసు, యం.నాగమణి, షేక్ మహమ్మద్ ఎన్నికయ్యారు.

శాస్త్రీయ విద్యాసాధనకై విద్యార్థులు ఉద్యమించాలి

విశాలాంధ్ర-విజయవాడ : కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, శాస్త్రీయ విద్యా సాధన కోసం, సమసమాజ స్థాపన కోసం పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం. రామకృష్ణ పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూవిజయవాడ నగర 9వ మహాసభ ఆదివారం విజయవాడలో స్థానిక చంద్ర రాజేశ్వరరావు గ్రంధాలయంలో జరిగింది. ఈ సభకు ముఖ్య వక్తగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని మనువాద భావాజలంతో నింపడానికే నూతన జాతీయ విద్యావిధానం -2020 తెచ్చిందన్నారు. దేశ వ్యాప్తంగా 1100 కు పైగా ఉన్న యూనివర్సిటీలను సంక్షోభంలోకి నెడుతున్నారని, యూనివర్సిటీలను అగ్రకుల ఆగ్రహారాలుగా మార్చారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లక్షకు పైగా ప్రభుత్వ పాఠశాలలు మూత పడ్డాయన్నారు. ప్రపంచబ్యాంకు షరతులకు లొంగి పాఠశాలలను, టీచర్ పోస్టులను కుదిస్తున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ పీజీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్ ను దూరం చేసే 77 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ మహాసభలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు యు.గనిరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజాన్ని కూడా అర్థం చేసుకోవాలని అన్నారు. ఈ మహాసభలో ఐఎఫ్‌టీయూ నాయకులు విగ్నేష్ మాట్లాడారు. విప్లవ విద్యార్థి ఉద్యమ గేయాలు ఆలపించారు.ఈ మహాసభకు పీడీఎస్‌యూ నగర నాయకులు వేణు అధ్యక్షత వహించారు. ముందుగా విద్యార్థి ఉద్యమంలో అమరులైన వారికి నివాళులు అర్పించడం జరిగింది. బిగిపిడికిలి జెండాను గనిరాజు ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ విజయవాడ నగర అధ్యక్షులుగా వైష్ణవ్, కార్యదర్శిగా వేణుతో పాటు 9మందితో నగర నూతన కార్యావర్గాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అనూష, ఉదయ్, హాషిణి, హరిణి, మణికంఠ, గురు విష్ణు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌ల సమర శంఖారావం'

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల మండలం పేరకలపాడు గ్రామంలో నందిగామ నియోజకవర్గ సర్పంచ్ ల సంఘం అధ్యక్షురాలు, గ్రామ సర్పంచ్ మన్నె సాత్విక అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జరిగిన సమర శంఖారావంలో ఉమ్మడి కృష్ణా జిల్లాల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు గోలి వసంత్ కుమార్ మాట్లాడుతూ సర్పంచుల న్యాయ సమ్మతమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.గ్రామపంచాయతీలకు ప్రభుత్వం నుండి రావలసిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచులు చేసే పోరాటానికి ప్రతి ఒక్కరు పూర్తిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో జరుగునున్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొనబోయే సర్పంచుల సమావేశానికి నందిగామ నియోజకవర్గం నుంచి ప్రతి గ్రామం నుండి స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నందిగామ నియోజకవర్గ సర్పంచ్ ల సంఘం అధ్యక్షురాలు, గ్రామ సర్పంచ్ మన్నె సాత్విక మాట్లాడుతూ సర్పంచుల సమస్యపై జరిగే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరు గళం విప్పాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధి కోసం జరిగే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో సర్పంచులు పడుతున్న ఇబ్బందులు మీద సర్పంచుల సంఘం తరపున పోరాటం చేస్తున్నామని, అన్ని పార్టీల వారిని ఆహ్వానించి ఆల్ పార్టీ మీటింగ్ పెట్టడం జరిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుని సర్పంచుల సంఘం తరపున ఆహ్వానించి, సర్పంచ్ల సమస్యలను వివరించి రాబోయే రోజుల్లో సర్పంచులకు న్యాయం జరిగేలాగా వినతిపత్రం ఇచ్చే కార్యక్రమం చేపట్టటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘం అధికార ప్రతినిధి గల్లా తిమోతీ, వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సకల జనుల సంక్షేమం కోసం యాగం

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): సకల జనుల సంక్షేమం కోసం యాగం చేయాలను కోవడం సంతోషమని విజయవాడ ఇస్కాన్ మందిర అధ్యక్షులు శ్రీమాన్ చక్రధారి దాస్ అన్నారు. శ్రీ రాదే శ్యామ్ లాజిస్టిక్స్ సంయుక్త అధినేతలు హరిదాసు దుర్గా ప్రసాద్, సజ్జా శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో రామలింగేశ్వర నగర్ జగన్నాథ్ మందిరం వద్ద జరిగిన యాగం సందర్భంగా చక్రదారి దాస్ మాట్లాడుతూ యాగ నిర్వహణకు ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. యాగ నిర్వాహకులకు శ్రీ కృష్ణ భగవానుని ఆశీస్సులు ఉంటాయని తెలిపారు. ముందుగా శ్రీనివాసరావు, దుర్గా ప్రసాద్ దంపతులు యాగంలో ఆశినిలవ్వగా, రామ్ రాఘవ దాస్ యాగ నిర్వహణ చేశారు. అనంతరం భక్తులకు, ఆహ్వానితులకు, స్థానికులకు ఉదయం, మధ్యాహ్నం ప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాండవదాస్, శ్రీకాంత్ నరసింహ దాస్, శ్యామ్ సుందర్ దాస్, గురునాథ్ ప్రసాద్ దాస్, రామారావు దాస్, కిషోర్ దాస్, లాడ్లి మాతాజీ, లలిత మతాజీలు కృష్ణమయి, తులసి భవాని, ప్రసన్న, శారద, ఇస్కాన్ రాధా శ్యామ సుందర్, జగన్నాథ్ మందిర భక్తులు పెద్దయెత్తున పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి!

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జి.ఆర్.పి హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండలు ఆదివారం తెలిపారు.ఆయన తెలిపిన వివరాలు గుణదల రైల్వేస్టేషన్ డౌన్‌లైన్‌లో ఉన్న రైల్వే ట్రాక్ సుమారు 40 నుండి 45 సం.లు వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు ట్టాలై నడుచుకుంటూ వెళ్ళుతున్న సమయంలో రైలు ఢీకొని మృతి చెందినట్లు ఉన్నాడు.మృతుడు 5.6 అడుగులు ఎత్తుతో చామనఛాయ రంగు కలిగి ఉన్నాడు, ఎడమ మోచేయ్యి క్రింద అనుడ్ఫ్ పచ్చబోట్టు ,కుడి మోచేయ్యి చేయ్యి కింద లవ్ సింబల్ లోపల ఎస్ అనే ఇంగ్లీష్ అక్షరం పచ్చబోట్టు కలిగి ఉన్నాడు.శరీరంపై సిమెంట్ కలర్ కట్‌డ్రాయర్ జాకీ పేరు ఉంది. పక్కన దుప్పటి,టవల్ ఉంది.అనారోగ్యంతో మతిస్థిమితం లేని పరిస్థితుల్లో రైలు పట్టాలపై నడుస్తుండగా రైలు ఢీకొని మృతి చెందినట్లు స్థానికులు తెలుపుతున్నారన్నారు. అంతకుమించి అధారాలు లభ్యంకాలేదు.వివరాలు తెలిసినట్లయితే రైల్వే పోలీస్ స్టేషన్‌లో గాని, 9440627544, 0866-2576006 సంప్రదించాలని కోరారు.

సైన్సు కాంగ్రెస్‌లో వీఎంసీ విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర-విజయవాడ : ఇటీవల కేఎల్ విశ్వవిద్యాయం లో జరిగిన 31వ జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్ (ఎన్‌సీఎస్‌సీ) రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొన్న పుచ్చలపల్లి సుందరయ్య నగర పాలక సంస్థకు చెందిన విద్యార్థి పగడాల భువనేశ్వరికి అభినందనలు వెల్లువెత్తాయి. పండ్ల తొక్కలు ఎండబెట్టి కంపోస్ట్ (ఫ్రూట్ పీల్ మాన్యూర్) ఎరువుగా తయారు చేసిన ప్రాజెక్టు జిల్లా నుంచి రాష్ట్రస్థాయి ఎంపిక కావటం తెలిసిందే. సాధారణ ఎరువులో ఉండే పోషకాల కంటే ఎక్కువగా ఉన్నట్లు పరీక్షల్లో తెలిసింది. ఈ సందర్భంగా ఎల్‌బీఎస్ నగరంలోని పాఠశాలలో విద్యార్థికి అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సైన్సు అధికారి మైనం హుసేన్ మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రంపై చిన్నపాటి ఉంచి ఆశక్తి పెంచుకుంటే భవిష్యత్తులో అద్భుతాలు సృష్టించగలరని చెప్పారు. విద్యార్థి పగడాల భువనేశ్వరిని,ప్రాజెక్టు గైడ్ టి.రాజ్యలక్ష్మిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.మోహన్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఉత్సాహంగా వనమహోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ : విశాలాంధ్ర జర్నలిస్టుల వనమహోత్సవం ఆదివారం ఉత్సాహంగా సాగింది. నున్న గ్రామంలోని మామిడితోటలో జర్నలిస్టులు కుటుంబ సమేతంగా పాల్గొని ఆటలు, పాటలతో డ్యాన్సులు చేస్తూ ఆనందంగా గడిపారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే వీరు ప్రశాంతమైన వాతావరణంలో ఉల్లాసంగా రోజువారీ యాంత్రిక జీవనశైలికి భిన్నంగా ఆప్యాయతల మధ్య సంతోషంగా వన భోజనం కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ నిర్లక్ష్యంతో పసివాడి ప్రాణం బలి

విశాలాంధ్ర-కంచికచర్ల: ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో ఆరుబయట ఆడుకుంటున్న పసివాని ప్రాణం బలైన సంఘటన కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కంచికచర్ల పోలీసులు అందించిన సమాచారం ప్రకారం పరిటాల గ్రామానికి చెందిన సుభాని అనే వ్యక్తి విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో ఔట్సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతని 18 నెలల కొడుకు అసిర్ అహమ్మద్ ఆదివారం ఉదయం ఆరున్నర గంటల ప్రాంతంలో ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో మంచినీళ్ళ క్యాన్లు డెలివరీ చేసే ఆటో ఆ ఇంటి సమీపంలో ఆగింది. బాలుడు అసిర్ అహమ్మద్ ఆటో ముందు భాగంలో ఆడుకుంటున్నాడు. వాటర్ క్యాన్లు డెలివరీ చేసిన ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా ఆడుకుంటున్న బాలుడిని గమనించకుండా ఆటోను ముందుకు పోనిచ్చాడు. దీంతో ఆటో టైర్ బాలునిపై ఎక్కింది. అచేతనంగా పడిపోయిన ఆ బాలుడిని స్థానిక వైద్యశాలకు తరలించి అక్కడి నుంచి విజయవాడ ఆసుపత్రికి తరలించారు. బాలుని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. తమ కళ్లెదుటే 18 నెలల పసికందు దుర్మరణం చెందడాన్ని జీర్ణించుకోలేక తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. ఈ మేరకు ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

నదీతీరాన ప్రకృతిలో పిల్లల ఉత్సాహం - ఉల్లాసం

విశాలాంధ్ర-విజయవాడ : వాతావరణం ఎండాకాలం, వానాకాలంల మధ్య కొట్టిమిట్టుడుచున్న శీతాకాల దినాల్లో, పర్యావరణ పరిరక్షణ సంస్థ అవార తలబెట్టిన "ప్రకృతిలో పిల్లల" శిబిరంతో వారధి దిగువున నదీతీరం కళకళలాడింది. తాడేపల్లి వైపు ఇసుక తిన్నెల మీద పిల్లల పరుగుతో ప్రారంభమైన ఈ కార్యక్రమం, నదీ శుచీకరణ, మాతృభాషలో ఆట-మాట-పాటలు, వ్యక్తిత్వవికాస కథా కాలక్షేపంతో సాగి, ఈతశిక్షణ, జలకేళితో చిన్నారుల కేరింతలు మధ్య ముగిసింది. ఈ కార్యక్రమాన్ని వేకువనే ప్రారంభించిన సీనియర్ సిటిజన్-ఈత విజేత మోహనబాబు, తెనాలి, గుంటూరు, గన్నవరం ప్రాంతాల నుండి చేరిన చిన్నారుల - తల్లిదండ్రుల సమూహాన్ని, క్రీడా ఛాంపియన్ల జీవితగాథలతో ముచ్చటించి, ఉత్తేజపరిచారు. తాను ఎన్నో రోజులుగా చదివి తెలుసుకొన్న అవార ఆదివారపు పిల్లల ఈతశిక్షణ-ప్రాణరక్షణ కార్యకలాపం, ఈనాడు ప్రత్యక్షంగా కూడా చూసి ముగ్ధులమయ్యామని తెలిపారు. కార్యక్రమ సమన్వయకర్త సౌజన్య, ప్రాణరక్షక్(లైఫ్ గార్డ్) పంకజ్, అరవింద ఉపాధ్యాయురాలు షారన్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అరవింద పాఠశాల విద్యార్థులు, అనేక తల్లిదండ్రులు, అవార సభ్యులు రమణ, జితేంద్ర, నరశింహారావు పాల్గొన్నారు. ప్రతి ఆదివారం వేకువ జామున 6 గంటలకి మొదలయ్యే ఈ ప్రకృతిలో పిల్లల కార్యక్రమంలో పాల్గొన ఆసక్తిగల తల్లితండ్రులు, 9494126812 వాట్సప్ నందు నమోదు చేసుకొనవచ్చునని నిర్వాహకులు తెలిపారు.